### పురుగుల మందు తాగి చావండి..

# డబ్బులు నేనిస్తా!

- గడ్డంగూడవాసులపై ఎఫ్ఆర్వో ఫైర్
- మందు గుళికలు మింగిన రైతు
- జన్నారం రేంజ్ కార్యాలయానికి తరలించి ఆందోళన
- ఆపై లక్షెట్టిపేట దవాఖానకు
- అధికారుల తీరుపై మంత్రి సీతక్క ఫైర్

జన్నారం, ఫిబ్రవరి 20 : అటవీ అధికారి అవమానించడంతో మనస్తాపం చెందిన ఓ గిరిజన రైతు మందు గుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా జన్నారం రేంజ్‌లోని గడ్డంగూడలో గురువారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. గడ్డంగూడలో గిరిజనులు వేసుకున్న గుడిసెలను రెండు రోజుల క్రితం అటవీ అధికారులు తొలగించారు. ఈ క్రమంలో గురువారం ఉదయం గడ్డంగూడకు సిబ్బందితో చేరుకున్న ఎఫ్ఆర్వో సుష్మారావు.. 'ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. వెంటనే ఖాళీ చేయాలి. లేదంటే సామాన్లను రేంజ్ కార్యాలయానికి తరలిస్తాం' అని రైతులను హెచ్చరించారు. 3 రోజులు గడువు ఇవ్వాలని వారు కోరగా.. 'పురుగుల మందు తాగి చావండి.. డబ్బులు లేకుంటే నేనిస్తా' నంటూ పోలీసుల ముందే దూషించడంతో కాలనీకి చెందిన రైతు రాథోడ్ తుకారాం విషగుళికలు మింగాడు. అతడిని కుటుంబ సభ్యులు, గూడెం వాసులు జన్నారం రేంజ్ కార్యాలయానికి తరలించి ఆందోళన చేపట్టారు. తుకారాం పరిస్థితి విషమించడంతో పోలీసులు వారికి నచ్చజెప్పి లక్షెట్టిపేట దవాఖానకు తరలించారు. ఆందోళనలో బోడ శంకర్, వసంత్‌రావు, పంతుల్యా, రాజు, రాంచందర్, జైతురావ, రమేశ్, శివ, రాథోడ్ లక్ష్మీబాయి, మన్నీబాయి, జగదీశ్ పాల్గొన్నారు.

**అధికారులు ఓవర్ యాక్షన్ ఆపండి: సీతక్క**

అటవీశాఖ అధికారులు ఆంక్షల పేరిట ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఓవర్ యాక్షన్ ఆపాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా జన్నారంలోని పైడిపెల్లి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరయ్యారు. టైగర్ జోన్ పేరుతో ఈ ప్రాంత ప్రజలను అటవీ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, చెక్‌పోస్ట్‌ల వద్ద వాహనాలను నిలిపివేయడం వల్ల వాహనదారులకు నష్టం జరుగుతుందని అన్నారు. పదేండ్లలో లేని ఆంక్షలు ఈ ఒక్క సంవత్సరంలో ఎలా వచ్చాయని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ఆత్మహత్యాయత్నం చేసిన తుకారాంను రేంజ్ కార్యాలయం నుంచి దవాఖానకు తరలిస్తున్న కుటుంబ సభ్యులు

## ఇసుక అక్రమ రవాణాను అరికడతాం

- మైనింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ శ్రీధర్ తనిఖీ

మహదేవపూర్(కాళేశ్వరం), ఫిబ్రవరి 20 : ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట నిఘా కొనసాగాలని మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, అన్నారం, పలుగుల, పూసుకుపల్లి, ముద్దులపల్లిలో ఇసుక రీచ్‌లను కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఆయా ఏరియాల్లో ఇసుక స్టాకు, గోదావరిలో ఇసుక తీసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24/7 ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ఇసుక కొరత లేకుండా బుకింగ్ చేయడానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు.



నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరులో యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో యూరియా కోసం బారులుతీరిన రైతులు

## యూరియా కోసం రైతుల పడిగాపులు

- సహకార సంఘాల వద్ద బారులు
- సగం మందికి దొరక్క ఇబ్బందులు

నమస్తేతెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, ఫిబ్రవరి 20: యాసంగి పూట యూరియా కష్టాలు తీవ్రమయ్యాయి. రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తుంది. ప్రభుత్వ నిర్లక్ష్యం.. అధికారుల పట్టింపులేమితో సొసైటీల వద్ద రోజంతా పడిగాపులు పడుతున్నా ఒక్క బస్తా కూడా దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. రైతులు ఉదయాన్నే సొసైటీల వద్దకు పరుగులు తీస్తూ, రోజంతా సహకార సంఘాల వద్ద పడిగాపులు కాస్తున్నా బస్తాలు దొరక్క గురువారం పలు జిల్లాల్లో రైతులు ఆందోళనకు గురయ్యారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైన, ఇదే జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్, మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట, నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు, వంగూరు మండలం రంగాపూర్‌లో, నారాయణపేట జిల్లా మక్తల్, నల్లగొండ జిల్లా త్రిపురారంలోని పీఏసీఎస్‌ల వద్ద రైతులు బారులు తీరారు. అయినప్పటికీ యూరియా దొరక్క చాలామంది నిరాశతో వెనుదిరిగారు.

# రైతులపై ఫారెస్ట్ అధికారుల దాష్టీకం

- బూటు కాళ్లతో తన్నుతూ విచక్షణారహితంగా దాడి
- అటవీ భూములను సాగు చేస్తున్నారని వీరంగం
- దవాఖానలో చికిత్స పొందుతున్న మహిళా రైతులు
- భూపాలపల్లి జిల్లాలో అమానవీయ ఘటన



భూపాలపల్లి మండలం ఆజంనగర్‌లో రైతులను తాళ్లతో బంధించి వాహనాల్లో తీసుకెళ్తున్న అటవీశాఖ అధికారులు



అటవీ శాఖ అధికారులు పిడిగుద్దులు గుద్దుతూ, బూటు కాళ్లతో తన్నడంతో స్పృహ కోల్పోయిన మహిళా రైతు

కృష్ణ కాలనీ, ఫిబ్రవరి 20: రైతులపై అటవీ అధికారులు దాడికి దిగారు. అటవీ భూముల్లో సాగు చేయొద్దని బూతులు తిడుతూ రైతులను తాళ్లతో కట్టేసి బూటు కాళ్లతో తన్నుతూ వీరంగం సృష్టించారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో చోటుచేసుకున్నది. భూపాలపల్లి మండలం ఆజంనగర్ గ్రామంలోని రైతులు వారి తాత ముత్తాతల నుంచి సాగు చేస్తున్న భూముల్లోకి గురువారం అటవీ అధికారులు జేసీబీలతో వెళ్లారు. ఇవి అటవీ శాఖ భూములని, ఇందులో సాగు చేయొద్దని బూతులు తిడుతూ రైతులను తాళ్లతో కట్టేసి బూటు కాళ్లతో తన్నుతూ నానా బీభత్సం సృష్టించారు. తమ భూములను లాక్కోవద్దని కాళ్లు మొక్కినా వినకుండా వాహనాల్లో తీసుకెళ్లారు. కొంతమంది మహిళా రైతులు స్పృహ కోల్పోవడంతో గ్రామస్థులు వారిని జిల్లా కేంద్రంలోని 100 పడకల దవాఖానకు తరలించారు. చికిత్స పొందిన మహిళా రైతులు పట్టెం శారద, శ్రీరాముల విజయ మీడియాతో మాట్లాడుతూ.. 40 ఏండ్లుగా తమ తాతముత్తాతల నుంచి 11 మంది రైతులం 25 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నామని, ఈ విషయం అటవీశాఖ అధికారులకు సైతం తెలుసని అన్నారు. గురువారం జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్‌రెడ్డి 150 మంది సిబ్బందితో వచ్చి బెదిరించినట్టు తెలిపారు. తాము సాగు భూములను జేసీబీలతో తవ్విస్తుండగా, తాము అడ్డుపడగా.. తమను బూటు కాళ్లతో తన్నుతూ తీవ్రంగా గాయపరిచినట్టు చెప్పారు. తాము స్పృహ కోల్పోయినప్పటికీ పిడిగుద్దులు గుద్దారని ఆవేదన వ్యక్తం చేశారు. కొండి శారద, పొదిళ్ల శ్రీను, పొదిల్లా రజితను తాళ్లతో కట్టేసి అధికారులు వారి వాహనాల్లో తీసుకువెళ్లారని, వారి ఆచూకీ తెలపాలని డిమాండ్ చేశారు. గత నాలుగేండ్లుగా తమ వద్ద డబ్బులు తీసుకుంటూనే, తమ కొడుకులపై కేసులు పెడతామంటూ బెదిరిస్తున్న అటవీ శాఖ అధికారులను సస్పెండ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అటవీశాఖ అధికారులతో తమకు ప్రాణభయం ఉన్నదని, తమపై దాడులు ఆపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

**పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు**

ఆజంనగర్ ఘటనపై రైతులు, అటవీ అధికారులు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. తమ వాహనాలపై రైతులు దాడి చేశారని అధికారులు, తమపైనే అటవీ అధికారులు విచక్షణారహితంగా దాడి చేశారని రైతులు భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ విషయమై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఉషకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు.

**కాంగ్రెస్ పాలనలో రైతులకు రక్షణ లేదు**

కాంగ్రెస్ పాలనలో రైతులకు రక్షణ కరువైందని బీఆర్‌ఎస్ నాయకుడు గోవిందుల శ్యామ్ ఆరోపించారు. అటవీశాఖ అధికారులు దాడిలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న మహిళా రైతులను ఆయన పరామర్శించారు. రైతులపై అటవీశాఖ అధికారులు విచక్షణారహితంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రైతులను బూటు కాళ్లతో తన్నుతూ తీవ్రంగా గాయపరచడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వెంటనే స్పందించి ఫారెస్ట్ అధికారులు తీసుకువెళ్లిన రైతుల జాడ తెలిసేలా చర్యలు తీసుకోవాలని, రైతులను తాళ్లతో బంధించి, బూటు కాళ్లతో తన్ని దాడి చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

## 24న కలెక్టరేట్ల వద్ద జర్నలిస్టుల నిరసన

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసనలు తెలిపి.. కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. గురువారం (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, పెన్షన్ స్కీంకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలకు ప్రభుత్వ గుర్తింపు, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని విమర్శించారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీ ఆనందం, పిల్లి రాంచందర్, బండి విజయ్‌కుమార్, ఎల్గొయి ప్రభాకర్, గుడిగ రఘు, కొప్పు నిరంజన్, విజయానంద్, కోశాధికారి తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టులో నాగం జనార్దన్‌రెడ్డికి ఊరట

- ఎఫ్ఐఆర్ కొట్టేసిన కోర్టు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 20: అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ నేత నాగం జనార్దన్‌రెడ్డిపై నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసును హైకోర్టు కొట్టేసింది. 2023 నవంబర్ 26న అనుమతి లేకుండా దాదాపు 300 మందితో నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురంలో రాత్రి 9:30 గంటల ప్రాంతంలో ర్యాలీ నిర్వహించారని ఫిర్యాదు అందింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా అనుమతి పొందకుండా ర్యాలీ నిర్వహించడం చట్టవిరుద్ధమంటూ అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఏ ఆధారాలు లేకుండా కేసు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని కోరుతూ నాగం హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఎఫ్ఐఆర్‌ను కొట్టేస్తూ తీర్పునిచ్చారు.

## వ్యవసాయరంగంలో ఇజ్రాయెల్ టెక్నాలజీ

- మంత్రి తుమ్మలతో కంపెనీ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): వ్యవసాయరంగంలో కొత్త టెక్నాలజీని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో ఇజ్రాయెల్ కంపెనీ ఎండీహెచ్ఏఐ ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు స్మార్ట్ అగ్రికల్చర్, ఏఐసెన్సార్, ఆటోమెషిన్ పద్ధతులు, డిజిటల్ రేయిన్ హార్వెస్టింగ్, గ్రే వాటర్ ట్రీట్‌మెంట్ వంటి వాటిపై వివరించారు. తెలంగాణలో వీటిని అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. దీనికి స్పందించిన తుమ్మల తమ అధికారులకు పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని కంపెనీ ప్రతినిధులను కోరారు.

## రాగల మూడు రోజుల్లో చిరు జల్లులు

హైదరాబాద్, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34 నుంచి 37 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. అయితే గత రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయని చెప్పారు. వాతావరణ మార్పులే ఇందుకు కారణమని వెల్లడించారు. ఈ పరిస్థితి మరో మూడు రోజులు కొనసాగొచ్చని, అక్కడక్కడ చిరు జల్లులు కూడా కురువొచ్చని పేర్కొన్నారు.

## మిర్చి రైతుల సమస్యలపై కేంద్రం దృష్టి

- నేడు ఢిల్లీలో కేంద్ర వ్యవసాయాధికారుల భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్రప్రభుత్వం దృష్టిసారించింది. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు భేటీ కానున్నారు. రైతులకు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం ద్వారా మద్దతు ధర కల్పించే విషయంపై చర్చించనున్నారు. ఏపీ ప్రభుత్వం రాసిన లేఖకు స్పందించిన కేంద్రం.. మిర్చిని ఎగుమతి చేసే మార్గాలపై చర్చించనున్నారు. అయితే ఏపీ రైతులతోపాటు తెలంగాణ రైతుల మిర్చి కూడా కేంద్రం కొనుగోలు చేస్తుందా.. లేదా అనే దానిపై స్పష్టత లేదు.

# పసుపు ధర పతనం!

- గిట్టుబాటుకాక రైతుల ఆందోళన
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- గరిష్ఠంగా 12వేలు దాటని కనీస ధర
- ఎక్కువ మందికి 9 వేలలోపే
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు
- 15 వేలు చెల్లించాలని డిమాండ్



నిజామాబాద్ మార్కెట్ యార్డులో రైతులుఅమ్మకానికి తీసుకొచ్చిన పసుపు

నిజామాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పసుపు రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతున్నది. పేరుకేమో నిజామాబాద్‌కు పసుపుబోర్డు తెచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ పెద్దలు మద్దతు ధరను కల్పించడంలో మాత్రం ఘోరంగా వైఫల్యం చెందారు. దీంతో పెనం నుంచి పొయ్యిలో పడ్డ చందంగా రైతుల పరిస్థితి మారింది. కనీస మద్దతు ధర రూ.15 వేలు దక్కితే కానీ రైతులకు మేలు జరగదు. మార్కెట్ అధికారుల మాయాజాలంతో క్వింటా పసుపు రూ.10 వేలలోపే పలుకుతున్నది. రూ.8వేల నుంచి రూ.10 వేలలోపే ధర పలుకుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు.

**పట్టించుకోని పసుపు బోర్డు**

జనవరి 14న నిజామాబాద్‌లో జాతీయ పసుపుబోర్డును ఓ ప్రైవేటు హోటల్‌లో ప్రారంభించి.. బోర్డు చైర్మన్‌గా పల్లె గంగారెడ్డిని నియమించారు. అయితే మద్దతు ధరరాక గడ్డుకాలాన్ని పసుపు రైతులు అనుభవిస్తుంటే పసుపుబోర్డు మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

**కానరాని కనీస మద్దతు ధర..?**

ఎకరా విస్తీర్ణంలో పసుపు సాగుకు రూ.1.20 లక్షలకు పైగా ఖర్చవుతున్నది. 9 నెలలపాటు ఎంతో శ్రమించి పండించే పసుపు సాగును కేంద్రం ప్రోత్సహించాలంటే కనీసం క్వింటాకు రూ.15వేలు ప్రకటించాలి. లేదంటే రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టిసారించే ప్రమాదముంది. నిజామాబాద్ మార్కెట్‌కు ప్రతిరోజూ 8వేల నుంచి 10 వేల క్వింటాళ్ల వరకు పసుపు వస్తుండగా.. పసుపు చూరాకు గరిష్ఠంగా రూ.10,566, కనిష్ఠంగా రూ.8వేలు.. గోల (బల్బ్)కు గరిష్ఠంగా రూ.10,727, కనిష్ఠంగా రూ.8 వేలు.. కాడి (ఫింగర్)కి గరిష్ఠంగా రూ.12,388, కనిష్ఠంగా రూ.10 వేలలోపే పలుకుతున్నది.

### రైతులు అమ్మినంక ధరలు పెరుగుడేంది?



మేం అమ్ముకుని ఊరికి పోయినంక పసుపు ధరలు పెరుగుతాయ్. యాటా ఇదే లొల్లి.. మేము అమ్మినంక ధర పెరుగుడు మతలబు ఏందో సమజైతలేదు. మార్కెట్‌కు తెచ్చినంక వెనక్కి తీసుకుపోలేం. చెప్పిన ధరకే అమ్ముకోవాల్సి అత్తున్నది.

**- భూమయ్య, పసుపు రైతు**

### రెక్కల కష్టానికి ఇలువ లేదు



తొమ్మిది నెలలపాటు సాకిన పంటను మార్కెట్‌కు తీసుకుపోతే గిట్టుబాటు అయితలేదు. వ్యాపారులు, దళారులకే ఫాయిదా అయితున్నది. మా రెక్కల కష్టానికి ఇలువ లేకుండా పోతున్నది. కనీసం రూ.15 వేల ధర అత్తేనే మాకు ఫాయిదా అయితది.

**- సాయిరెడ్డి, పసుపు రైతు**

### రైతులకు విలువే లేదు



మాది జగిత్యాల జిల్లా. ఏండ్ల సంది పసుపు సాగు చేస్తున్నం. ఎప్పుడూ మా కష్టానికి తగ్గ ఫలితం అస్తలేదు. బయట ప్రతి వస్తువు ధరలు పెరుగుతున్నయ్. కానీ మాకాడికి వచ్చేసరికి ధర పెరుగుతలేదు. పసుపు పంటను కొనేటప్పుడు ధర పెంచడం లేదు. ఇలా ఎందుకు జరుగుతుందో అర్థమైతలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదుకోవాలె.

**- బుచ్చన్న, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి**

### నోటమాటస్తలేదు



9 నెలల పాటు కష్టపడి పండిస్తున్న పసుపు పంటకు ధర దక్కుత లేదు. పసుపు తీసుకుని మార్కెట్లకు అస్తే ఈడ ధరలు చూసి నోటమాట అత్తలేదు. పసుపు సాగుకు పెట్టే ఖర్చుకు.. అచ్చే ధరకు పొంతన లేదు. బిగేడు పసుపు పంట పండియ్యాలంటే లక్షన్నర దాకా ఖర్చయితుంది. ఆ పంట అమ్మితే అంత కూడా అత్తలేదు. గిట్లయితే ఎట్ల బతకాలే. క్వింటాకు రూ.15 వేల ధర అత్తేనే ఏమన్న లాభముంటది.

**- ఆశన్న, పసుపు రైతు, నిర్మల్ జిల్లా**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం పోలారం సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేసి, వినతిపత్రం అందజేస్తున్న మాస్‌లైన్ నాయకులు, రైతులు

## సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నా

- కోతలు లేకుండా త్రీఫేజ్ విద్యుత్ అందించాలి
- రైతులు, 'మాస్‌లైన్' నాయకుల డిమాండ్

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 20: యాసంగి పంటలు సాగు చేసే రైతులకు నాణ్యమైన త్రీఫేస్ విద్యుత్ అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో కొమరారం, పోలారం సబ్‌స్టేషన్ల ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ కమిటీ కార్యదర్శి బుర్ర రాఘవులు మాట్లాడుతూ విద్యుత్ కోతలు, హెచ్చుతగ్గులతో మోటర్లు కాలిపోతున్నాయని, వాటిని బాగు చేయించుకోవడానికి రైతులు అప్పు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.



ఎస్సారెస్పీ కాల్వ బ్రిడ్జిపై రాస్తారోకో చేస్తున్న పెన్‌పహాడ్ మండల రైతులు

## సాగునీటి కోసం రైతుల రాస్తారోకో

ఆత్మకూర్ ఎస్, ఫిబ్రవరి 20: సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ ఎస్ మండలంలోని కోటినాయక్‌తండా వద్ద ఎస్సారెస్పీ కాల్వ బ్రిడ్జిపై పెన్‌పహాడ్ మండలానికి చెందిన రైతులు గురువారం సాగునీటి కోసం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వారబందీ పద్ధతిలో ఈ నెల 16న గోదావరి జలాలు విడుదల చేసిన అధికారులు ప్రధాన కాల్వకు నీటిని అందించకపోవడంతో పెన్‌పహాడ్ మండలంలో పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కోటినాయక్ తండా వద్ద ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ డీబీఎం 71 ద్వారా పెన్‌పహాడ్ మండలానికి నీరు రావాల్సి ఉండగా, ప్రధాన కాల్వకు నీళ్లు అందించకుండా 36ఎల్ కాల్వ ద్వారా మోతె మండలానికి తరలిస్తున్నారని మండిపడ్డారు. ఇరిగేషన్ డీఈ రమేశ్ చేరుకుని నీటిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ప్రధాన కాల్వ గేట్లను ఎత్తడంతో మెయిన్ కెనాల్ నుంచి నీటి సరఫరా ప్రారంభమైంది.

# పంపింగ్ చేస్తేనే పంటలు బతుకుతయ్

- మల్కపేటకు కేటాయించని నీళ్లు
- అనుమతి కోసం ఎదురుచూపులు



ఎల్లారెడ్డి పేట మండలంలోని రాజన్నపేటలో కాల్వపై రైతులు ఏర్పాటు చేసుకున్న మోటర్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 20: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని రైతులు పది రోజులుగా నీళ్ల కోసం అధికారులు, నాయకులు చుట్టూ తిరుగగా మల్కపేట రిజర్వాయర్ నీళ్లను కాల్వలోకి వదిలారు. మూడు రోజుల్లో మోటర్లు పెట్టి పొలాలకు పారించడంతో కాల్వలో నీళ్లు తగ్గడంతో మళ్లీ చివరి ఆయకట్టు రైతులు ఆందోళనలో పడ్డారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ నుంచి రాజన్నపేట వరకు కాల్వలో ఉన్న నీటిని పొలాలకు పెట్టుకుంటున్నప్పటికీ రాజన్నపేట శివారు నుంచి కిష్టూనాయక్ తండా, దేవునిగుట్ట తండా, బాకుర్‌పల్లి, తిమ్మాపూర్ వరకు ఉన్న కాల్వలో నీరంతా ఇంకిపోయింది. దీంతో కాల్వలోని నీటిని పారించేందుకు తెచ్చిన మోటర్లు కాలిపోగా, మరికొన్ని పనికిరాకుండా పోయాయి. దీనిపై ఈఈ కిశోర్ కుమార్‌ను వివరణ కోరగా మల్కపేట రిజర్వాయర్‌లో ఒక అడుగు మేర నీరు ఉండగా కాల్వలో వదిలామని, ప్రస్తుతానికి నీళ్లు ఇచ్చే పరిస్థితి లేదని తెలిపారు. మిడ్ మానేర్ నుంచి పలు ప్రాంతాల ఆయకట్టుకు నీళ్లు వదిలేందుకు నిర్ణయం జరిగిందని, మల్కపేటలో లేకపోవడంతో నీటిని పంపింగ్ చేయలేదని చెప్పారు. పంపింగ్ చేస్తే అర టీఎంసీ నీళ్లు వదిలినా కాల్వ, చెరువుల్లో నీళ్లు నింపి సింగ సముద్రం వరకు వచ్చే పరిస్థితి ఉందని, ఉన్నతాధికారుల అనుమతి కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు.

### కాల్వల నీళ్లు చూసి సంబురపడ్డ



పంట ఎండిపోతుందనుకునే సరికి కాల్వల నీళ్లు వచ్చినయ్. మోటర్‌తో పెట్టుకున్న. రెండెకరాలుంటే మరో రెండెకరాలు కౌలుకు తీసుకున్న. కౌలుకు తీసుకున్న రెండెకరాలకు నిన్నటి దాకా నీళ్లచ్చి బంద్జైనయ్. లక్ష దాకా పెట్టుబడి పెట్టిన. పంటేమైతదో అర్థమైతలేదు. మిడ్ మానేర్ నుంచి పంపింగ్ చేయడం తప్ప మార్గం లేదని అధికారులు చెపుతున్నరు. నాయకులు, అధికారులు పంటలు కాపాడాలె.

**- నాంపల్లి ప్రశాంత్, రైతు, రాజన్నపేట, ఎల్లారెడ్డిపేట**